క్లుప్తంగా

మహిళలకు చేయూత ఇస్తే కుటుంబం బలపడుతుంది


పెరవలిలో కుట్టు నేర్చుకునే మహిళలతో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, అధికారులు

పెరవలి: మహిళలకు చేయూతనందిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా బలపడుతుందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తెలిపారు. పెరవలిలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దేవరపు వెంకట్రాయుడు ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు నేర్చుకునే 133 మంది మహిళలకు కత్తెర్లు, 17 అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, 17 ఏళ్ల క్రితం ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో లయన్స్ క్లబ్‌ను స్థాపించానన్నారు. కు ర్చీలు అందించిన మాదిరెడ్డి కృష్ణకుమారి, కత్తెర్లు ఇచ్చిన దేవరపు జయరాణిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీఓ పద్మజ, తహసీల్దార్ కె నిరంజన్, లయన్స్ సభ్యులు ఆర్సి అల్లూరి , బూరుగుపల్లి రాజు, కోటిపల్లి మురళీ కృష్ణ, దేవరపు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు లేకుండానే వైద్య శిబిరం


అనంతపల్లి శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ సంధ్యారాణి

నల్లజర్ల: పీహెచ్‌సీ డాక్టర్ల సమ్మె కారణంగా వైద్యులు హాజరు కాకుండానే స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలు నిర్వహించారు. సోమవారం అనంతపల్లి సచివాలయం -1 పరిధిలో నిర్వహించిన వైద్య శిబిరంలో 132 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసి సిబ్బంది మందులు అందజేశారు. సర్పంచ్ కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఊరట

నిడదవోలు రూరల్: జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి ఆదాయం ఆదా అవుతుందని ఎంపీడీఓ వీఎస్‌వీఎల్ జగన్నాథరావు అన్నారు. మండలంలోని డి.ముప్పవరం, జీడిగుంట, కలవచర్ల, కోరుపల్లి, మునిపల్లి, పందలపర్రు, పెండ్యాల, పురుషోత్తపల్లి, విజ్జేశ్వరం గ్రామాల్లోని సచివాలయాల్లో జీఎస్టీ 2.0తో ప్రజలకు కలిగే లబ్ధిపై అవగాహన సదస్సులు సోమవారం నిర్వహించారు.

రైతులకు మెరుగైన సేవలు

చాగల్లు: రైతులకు మెరుగైన సేవలు అందించే విధంగా సొసైటీలు పనిచేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఊనగట్ల సొసైటీ మహాజన సభ సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివ నాగేంద్ర అధ్యక్షతన జరిగింది. సొసైటీ కార్యదర్శి కేతనపల్లి శ్రీనివాసరావు వార్షిక నివేదికను సభకు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సంఘానికి రూ.17.19 లక్షల లాభం వచ్చిందని, సంఘ బైలా ప్రకారం సభ్యులకు పంపిణీ చేస్తామన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 500 మందికి వైద్య పరిక్షలు నిర్వహించారు. 20 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వంద మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించి సొసైటీ ఆర్థిక సహాయంతో అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై చర్చ

తాళ్లపూడి (కొవ్వూరు): రానున్న పుష్కరాల నేపథ్యంలో పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కౌన్సిల్ సమావేశంలో సభ్యులు చర్చించారు. సోమవారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణాన్ని సుందరంగా తయారు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కౌన్సిల్ సభ్యులు వారి వార్డుల్లో చేయాల్సిన పనులపై దృష్టి పెట్టాలని తెలిపారు. అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులు పరిశీలించి ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ సందీప్ కుమార్, కౌన్సిలర్లు కోడూరి శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, రుత్తల భాస్కరరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ, బత్తి నాగరాజు, అక్షయపాత్ర రవీంద్ర శ్రీనివాస్, మదిపట్ల సాయిగీత, చాందిని, అంకోలు లిల్లీ పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు

తాడేపల్లిగూడెం రూరల్: అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ జిలాని తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో లింగారాయుడిగూడెం గ్రామ వాసి రామలక్ష్మికి నిడదవోలు మండలం కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన వీరమళ్ల అంజిబాబుకు 2012లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.5 లక్షలు లాంఛనాలు అందజేశారు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కొంతకాలం కాపురం సజావుగా సాగగా.. ఇటీవల అదనపు కట్నం కోసం భర్త, అత్త, మరిది, పెద్ద అత్త వేధిస్తుండటంతో బాధితురాలు సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

- ఇబ్బందులు పెట్టినవారి పేర్లు బుక్‌లో నమోదు
- అరాచకాలకు మూల్యం తప్పదు



నల్లజర్లలో పార్టీశ్రేణులతో డిజిటల్ బుక్ క్యూ ఆర్‌కోడ్ ఆవిష్కరిస్తున్న తానేటి వనిత


చాగల్లులో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

నల్లజర్ల: కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు పరాకాష్టకు చేరడంతో కార్యకర్తలకు అండగా ఉండేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ ప్రవేశపెట్టారని మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం నల్లజర్లలో మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో ఆమె డిజిటల్ బుక్‌ను ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 మాసాలైనా చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ ప్రజలను పీడించడానికి వైఎస్సార్ సీపీని అణగదొక్కడానికే అన్నట్లు వారి పాలన సాగుతుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ వేధింపులకు పాల్పడుతోందని ఆమె విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఈప్రభుత్వం అమలు చేయలేకపోతుందన్నారు.

పార్టీ నేతలకు భరోసా..

తమ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కూటమి ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని బాధితులందరికీ అండగా ఉండేందుకే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. కూటమి ప్రభుత్వ పాలకుల ఆదేశాలతో వైఎస్సార్ సీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టేలా అధికారులు చట్టాలను అతిక్రమించి వ్యవహరిస్తే భవిష్యత్తులో ఎక్కడున్నా వదిలిపెట్టబోమన్నారు. కూటమి పాలకుల చేతిలో నష్టపోయిన బాధితులు డీబీ.డబ్ల్యూఈ వైఎస్సార్ సీపీ.కామ్ అనే వెబ్‌సైట్‌లో ఫిర్యాదులు నమోదు చేయవచ్చునన్నారు. 040-49171718 నంబర్‌కు కాల్ చేసి సమస్యను చెప్పవచ్చునన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు యజ్జవరపు లక్ష్మి, ఎంపీటీసీ యడ్లపల్లి మార్త, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బంక అప్పారావు, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, డాక్టరు అల్లూరి సూర్యచంద్రరావు, మేణ్ని యువరాజు, తొమ్మండ్రు రమేష్, నక్కా పండు, సయ్యద్ మునాఫ్, కండెపు రామకృష్ణ, గుడిశే వీరాస్వామి, చుక్కా నరసింహరావు, అచ్యుత వీరాస్వామి, పల్లి సుబ్బారావు, ప్లీడరు బాబ్జి, జాదుల దుర్గారావు, గొటికల కృష్ణ, పెనుమాక వెంకటరత్నం యడ్లపల్లి మంగరాజు, కొమరాపు శ్రీను, ములగాల గోపి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌తో కూటమికి చరమగీతం

చాగల్లు: కూటమి ప్రభుత్వ అన్యాయాలు, అక్రమాలకు చరమగీతం పలికే ఆయుధం ‘డిజిటల్ బుక్’ అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. సోమవారం చాగల్లులో మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్ నివాసంలో జరిగిన పార్టీ సమావేశంలో డిజిటల్ బుక్‌ను మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆవిష్కరించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎదుర్కొంటున్న అన్యాయాలు, రాజకీయ కక్షలపై న్యాయ పోరాటం సాగించేందుకు డిజిటల్ బుక్ ఓ శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ బుక్‌లో కార్యకర్తలు తమ అనుభవాలను, అన్యాయాలను, రాజకీయ దాడుల వివరాలను ఫోటోలు, ఆధారాలతో సహా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అప్‌లోడ్ చేయవచ్చునని స్పష్టం చేశారు. అందిన ప్రతి ఫిర్యాదు డిజిటల్లో భద్రంగా ఉంటుందన్నారు. ఐవీఆర్‌ఎస్ ఫోన్ నంబర్ 040-49171718 ద్వారా సమస్యపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అధికారంలోకి రాగానే చర్యలు..

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే, కార్యకర్తలపై కుట్రలు పన్నినవారిని చట్టపరంగా శిక్షిస్తామని పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ఇచ్చారన్నారు. అధికారులు న్యాయబద్ధంగా, నిర్భయంగా వ్యవహరించాలని, రాజకీయ ఒత్తిళ్లకు లోనవకుండా ప్రజల పక్షాన నిలవాలన్నారు.

ప్రతి కార్యకర్త ఫోన్‌లో డిజిటల్ బుక్ ఉండాలి

ప్రతి కార్యకర్త, అభిమాని తన మొబైల్‌లో డిజిటల్ బుక్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఇది కేవలం ఫిర్యాదుల పుస్తకం కాదు ప్రజల బాధలను వెలికి తీసి, వారికి న్యాయం కల్పించే శక్తివంతమైన మార్గదర్శకం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జుట్టా కొండలరావు, మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, పార్టీ జిల్లా కమిటీ నాయకులు ఇంటి వీర్రాజు, జాలెం వెంకట్రావు, గెడా శ్యామ్, బొర్రా రజనీ ప్రసాద్, పిండి మంగరాజు, గెడ్డం సురేష్, గురువెల్లి కోట సత్యనారాయణ, రమేష్, శిరిషా తదితరులు పాల్గొన్నారు.

‘జొన్నకూటి’కి పురస్కారం


సాహిత్య కిరీటి పురస్కారాన్ని అందుకుంటున్న ప్రమోద్ కుమార్

తాళ్లపూడి: ఐఎస్ఓ సర్టిఫికెట్‌తో పాటు 36 వరల్డ్ రికార్డ్స్ సాధించిన ఏకైక సాహితీ సంస్థ శ్రీశ్రీ కళావేదిక 155వ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియం వద్ద ఆదివారం నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుమారు 150 మంది కవులకు, రచయితలకు, సామాజిక సేవా కార్యకర్తలకు సాహిత్య కిరీటి పురస్కారాన్ని అందజేశారు. మండలంలోని పైడిమెట్ట గ్రామానికి చెందిన కవి, రచయిత, వ్యాసకర్త, ప్రచురణ కర్త, జర్నలిస్ట్, ఉపాధ్యాయులు, సామాజిక సేవ కార్యకర్త డా.జొన్నకూటి ప్రమోద్ కుమార్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలి


ఆలయంలో పూజలు చేస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

చాగల్లు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. దసరా మహోత్సావాలలో భాగంగా చాగల్లులో మాతంగి చెరువు గట్టుపై ఉన్న కనక దుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారిని ఆయన సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తలారి వెంకట్రావును పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జుట్టా కొండలరావు, మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ పాలనపై తిరుగుబాటు ఖాయం

నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తలారి వెంకట్రావు



ఆరికిరేవులో జరిగిన రచ్చబండలో పాల్గొన్న తలారి వెంకట్రావు, గూడూరి శ్రీనివాస్ తదితరులు

తాళ్లపూడి(కొవ్వూరు): రాష్ట్రంలో ఎక్కడ చూసినా దోపిడీ పాలన సాగుతుందని, దీనిపై ప్రజలు తిరుగుబాటు చేయడం ఖాయమని నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని దొమ్మేరులో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి నాగరాజు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయని విధానంపై రచ్చబండ నిర్వహించి మోసాలను ప్రజలకు వివరించారు. వెంకట్రావు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. కూటమి నాయకులు మద్యం, ఇసుక ఇలా అన్నింటా దోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేశారన్నారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చి అమలు చేయని వారిని మోసకారి అని అంటారన్నారు. వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా.. ఎవరైనా ప్రశ్నిస్తే వాళ్ల నాలుక మందం అని చంద్రబాబు అంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి బండి అబ్బులు, నియోజకవర్గ పరిశీలకులు గిరిజాల బాబు, మాజీ ఎమ్మెల్సీ కూడూరి శివరామకృష్ణ, మండల కన్వీనర్ వెంపాటి సురేష్, గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి నాగరాజు, సర్పంచ్ తానేటి కుమారి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి సోమరాజు, పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, ముఖ్యనాయకులు చౌటుపల్లి వీరన్న, తోట రామకృష్ణ, నగ్గలపాటి శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమిపై వ్యతిరేక పవనాలు


పల్లంట్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి: చంద్రబాబు మోసాలను ప్రజలు గమనిస్తున్నారని మండల పరిషత్ అధ్యక్షుడు కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో సోమవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ సమావేశంలో దుర్గారావు మాట్లాడారు. మోసం చేయడం చంద్రబాబు నైజాం అని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ మాట్లాడుతూ, ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఈదుపుగంటి ప్రసాద్, మండల మహిళా అధ్యక్షురాలు కడలి హైమావతి, పార్టీ నాయకులు కుసులూరి వెంకటసతీష్, పల్లి రత్నారెడ్డి పాల్గొన్నారు.

కౌన్సిలర్లపై ఉద్యోగుల చిన్నచూపు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మందిరంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. అజెండాలో 23 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. టీడీపీ కౌన్సిలర్ నాగేశ్వరావు మాట్లాడుతూ, పట్టణంలో ఉన్న 110 మంది వార్డు సచివాలయ ఉద్యోగులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నా కమిషనర్ కృష్ణవేణి పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, పట్టణంలోని సచివాలయాల ఉద్యోగులకు, వార్డు కౌన్సిలర్లకు సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం చేపట్టే ప్రతి సమాచారాన్ని సభ్యులకు తెలియపరచేటట్లు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలరాజు మాట్లాడుతూ, గణపతి సెంటర్ నుంచి ప్రభుత్వాసుపత్రి రోడ్డు ఆక్రమణలో నిండిపోయిందన్నారు. దీంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టణంలో అభివృద్ధి పనులు

రుడా, మున్సిపల్ శాఖ నిధులతో పట్టణంలో కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. పట్టణంలో రూ.7.74 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే పనులకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్ తదితర అభివృద్ధి పనులకు రుడా నిధులు సమీకరించామన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జికి రైల్వే శాఖ రూ.8.67 కోట్లు మంజూరు చేయగా మున్సిపల్ శాఖ నుంచి రూ.75 లక్షలు ఏర్పాటు చేస్తామన్నామన్నారు. రహదారులపై చెత్తా చెదారం, మురుగు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వజీరుద్దీన్, మున్సిపల్ డీఈ సత్యనారాయణ, ఏఈఈ హేమంత్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలి


కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో

తాళ్లపూడి(కొవ్వూరు): మీ కోసం కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు ఏడు అర్జీలు వచ్చాయన్నారు. అర్జీల పరిష్కారం కోసం వారంలో రెండు రోజులు ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించి జిల్లా అధికారి, డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మీకోసంలో వచ్చిన కొన్ని అర్జీలు

కుమారదేవానికి చెందిన సత్యనారాయణ గ్రామంలో వీధిలైట్లు బాగు చేయించాలని ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన ప్రకాశరావు, తెల్లరేషన్ కార్డు, వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు.

సొసైటీ లాభం రూ.42.14 లక్షలు

దేవరపల్లి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ)కి 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.42.14 లక్షలు నికర లాభం వచ్చినట్టు అధ్యక్షుడు ఉప్పులూరి రాంబాబు తెలిపారు. లాభాల నుంచి రైతులకు 15 శాతం డివిడెండ్ ఇస్తున్నట్టు ఆయన ప్రకటించారు. సభ్యుల షేరు ధనం రూ.11,16,56,359 ఉండగా, డిపాజిట్లు రూ.11.16 కోట్లు, డీసీసీబీకి రూ.15.70 కోట్లు చెల్లించాలని, సభ్యుల నుంచి రూ.19.77 కోట్లు అప్పులు రావలసి ఉందని, ప్రస్తుత సంవత్సరం వరకు రూ.7.34 కోట్లు రుణాలు ఇచ్చినట్టు ఆయన వివరించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

నిడదవోలు : పీఎం స్వనిధి ద్వారా కల్పిస్తున్న రుణాలను చిరువ్యాపారులు సద్వినియోగించుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవార చిరు వ్యాపారులకు లోక్ కళ్యాణ్ మేళ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ, పీఎం స్వనిధి ద్వారా కల్పిస్తున్న రుణాలను ప్రతి చిరు వ్యాపారి సకాలంలో బ్యాంకులకు చెల్లించి మరిన్ని ఎక్కువ రుణాలను పొంది వారి భవిష్యత్తును వారే తీర్చిదిద్దుకోవాలని అన్నారు. పీఎం స్వనిధి రుణాలు రూ.3 లక్షల నమూన చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.కనకరాజు, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

సబ్సిడీపై దాణా పంపిణీ

పెరవలి: పశువులకు 50 శాతం సబ్సిడీపై దాణా అందిస్తున్నామని అర్హత గల రైతులు దీనిని పొందవచ్చని పశు వైద్యాధికారిణి సల్మా తెలిపారు. మండలంలోని మల్లేశ్వరంలో సోమవారం 38 మంది పాడి రైతులకు దాణా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, మండలంలో 18 టన్నులు పశువుల దాణా వచ్చిందని, దీనిని రైతులకు అందిస్తున్నామని తెలిపారు. 50 కిలోల బస్తా విలువ రూ.1100లని, దీనిని 50 శాతం సబ్సిడీపై రైతులకు కేవలం రూ.550లకు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కోటిపల్లి మురళీకృష్ణ, మేడిచెర్ల సత్యనారాయణ మూర్తి, రైతులు పాల్గొన్నారు.

కరుణించమ్మా.. అక్షర స్వరూపిణి..


తాళ్లపూడిలో సరస్వతీ దేవిగా కనకదుర్గమ్మ


ఖండవల్లిలో కనకదుర్గమ్మ


అన్నదేవరపేటలో సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు


దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో సరస్వతీదేవి పూజ చేస్తున్న విద్యార్థులు


కోటసత్తెమ్మకు పట్టుచీర తీసుకొస్తున్న మంత్రి దుర్గేష్

తాళ్లపూడి: శరనవరాత్రుల్లో భాగంగా సోమవారం చదువుల తల్లి సరస్వతీ దేవికి విద్యార్థులు పూజలు చేశారు. తాళ్లపూడిలోని నవదుర్గాధి పరివార సహిత కనకదుర్గమ్మ వారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో విద్యార్థులు పెన్నులు, పుస్తకాలు ఉంచి సరస్వతీ దేవీకి సామూహిక పూజలు చేశారు. అన్నదేవరపేట వేగులమ్మ ఆలయం, బీసీ కాలనీ వద్ద సరస్వతీ పూజలు జరిగాయి. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. వేగేశ్వరపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పెరవలి సత్యప్రసాద్, సాయి ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళలు సామూహిక సరస్వతీ దేవి పూజలు నిర్వహించారు. మలకపల్లిలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

పెరవలి: నవరాత్రుల సందర్భంగా సోమవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ముఖ్యంగా ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, పెరవలి, ముక్కామల, వెంకట్రాయపురం, కానూరు గ్రామాల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయాల వద్ద కుంకుమార్చనలు చేపట్టారు. ఖండవల్లి కనకదుర్గమ్మ ఆలయం వద్ద వందలాది భక్తులు పూజలు చేశారు. అలాగే అన్నవరప్పాడు శక్తిమ్మతల్లి ఆలయం వద్ద మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొని సామూహిక వత్రాలు చేశారు. వెంకట్రాయపురంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఇక్కడ అమ్మవారి ప్రతిమ విజయవాడ కనకదుర్గమ్మలా ఉండటంతో భక్తులు అమ్మవారిని చూసి పరవశిస్తున్నారు.

సరస్వతీదేవిగా అమ్మవారు

నిడదవోలు రూరల్: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం అమ్మవార్లు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న అమ్మవార్ల ఆలయాలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మను మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకుని పట్టుచీర సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవి శంకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు. గోపవరం గుబ్బల మంగమ్మ, సమిశ్రగూడెంలో పుంతలోముసలమ్మ ఆలయాల వద్ద భక్తులు అమ్మవార్లను దర్శించుకుని కుంకుమపూజలు చేశారు. లోహియానగర్‌లో కనకదుర్గమ్మ, కోరుమామిడిలోని అమ్మేపల్లిలో వీరాంజనేయ సహిత రాజరాజేశ్వరీస్వామి, కంసాలిపాలెం శ్రీదేవీ పాటిమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

చిన్నారుల పూజలు

దేవరపల్లి: చదువుల తల్లి సరస్వతి దేవికి చిన్నారులు, విద్యార్థులు భక్తి శ్రద్ధలతో పుస్తకాలకు పూజలు నిర్వహించారు. దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం దేర్గాదేవిని సరస్వతిదేవిగా అలంకరణ చేసి భక్తులు పూజలు నిర్వహించారు. విద్యార్థులతో ఆలయాలు పోటెత్తాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆలయాల్లో పూజలు జరిగాయి. విద్యార్థులకు పలువురు భక్తులు కొత్త పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

నల్లజర్ల: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం పోతవరం జమ్మిచెట్టు వద్ద ఉన్న కామాక్షి అమ్మవారి 37వ వార్షికోత్సవ వేడుకల్లో సరస్వతిదేవిగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లజర్ల వనదుర్గా దేవి ఆలయం, అనంతపల్లి ఆనందతిరుమల వెంకటేశ్వరుని ఆలయంలో దుర్గాంబకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

వైభవంగా సరస్వతీ పూజలు

నిడదవోలు: ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో మహాలక్ష్మమ్మ బరింకలమ్మ పోతురాజు స్వామి వార్ల ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులు సామూహిక సరస్వతీదేవి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.